ఆకాశవాణి : : హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 13.06.2024 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలో గొర్రెల పంపిణీ పథకంలో అక్రమాలపై ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద విచారణ చేపట్టనుంది.
2. NEET UG - 2024 ఫలితాలలో గ్రేస్ మార్కులు పొందిన 1,563 మంది విద్యార్థుల స్కోర్ కార్డులను రద్దు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలియచేసింది.
3. గ్రేటర్ వరంగల్ నగర ముంపు సమస్య పరిష్కారానికి శాశ్వత ప్రాతిపదికన దీర్ఘకాలిక ప్రణాళికలు అమలు చేయాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు.
4. రాష్ట్రంలో పలు జిల్లాల్లో మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

ED – SHEEP SCAM

రాష్ట్రంలో గొర్రెల పంపిణీ పథకంలో అక్రమాలపై ఈడీ దృష్టి సారించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద దీనిపై విచారణ చేపట్టనున్నామని రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సమాఖ్య మేనేజింగ్ డైరెక్టర్‌కు హైదరాబాద్‌లోని ఈడీ జోనల్ కార్యాలయం సంయుక్త సంచాలకుడు ఆ లేఖ రాశారు. ఈ పథకానికి సంబంధించిన పూర్తి సమాచారం ఇవ్వాలని లేఖలో పేర్కొన్నారు. గొర్రెల కొనుగోళ్ల పేరిట దాదాపు 700 కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందన్న ఆరోపణలపై ఇప్పటికే ఏసీబీ విచారణ చేస్తోంది. భారీగా డబ్బు చేతులు మారినట్లు అభియోగాలు వెల్లువెత్తడం, ఇతర రాష్ట్రాల్లోనూ ఈ అక్రమాలతో సంబంధనం ఉందన్న అనుమానంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ED) దర్యాప్తు చేయనుంది. జిల్లాల వారీగా లబ్ధిదారుల పేర్లు, వారి అడ్రస్‌లు, ఫోన్ నంబర్లు, బ్యాంకు ఖాతాల వివరాలు తదితర సమాచారం ఇవ్వాలని ఈడీ కోరింది.

(Desk)

NEET exam

NEET UG - 2024 ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గ్రేస్ మార్కులు పొందిన 1,563 మంది విద్యార్థుల స్కోర్ కార్డులను రద్దు చేస్తున్నట్లు సుప్రీంకోర్టుకు తెలిపింది. వారందరికీ జూన్ 23న మరోసారి పరీక్ష నిర్వహించి, జూన్ 30లోపు ఫలితాలు వెల్లడిస్తామని పేర్కొంది. అటు NEET కౌన్సిలింగ్ యథావిధిగా కొనసాగించొచ్చని సుప్రీం కోర్టు కేంద్రానికి తెలిపింది. దీనిపై స్టే విధించబోమని స్పష్టం చేసింది.

(Desk)

Konda surekh ( wgl)

వర్షాకాలంలో ఉత్పన్నమయ్యే వరంగల్ నగర ముంపు సమస్య పరిష్కారానికి శాశ్వత ప్రాతిపదికన దీర్ఘకాళిక ప్రణాళికలు అమలు చేయాలని దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ అధికారులకు సూచించారు. నగరంలో ముంపు నివారణ చర్యలపై సంబంధిత అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, గ్రేటర్ వరంగల్ మున్సిపల్

కమిషనర్ అశ్విని తనాజీ వాఖడే, నగర మేయర్ గుండు సుధారాణి, గ్రేటర్ వరంగల్ పరిధిలోని ఎమ్మెల్యేలు సమీక్షలో పాల్గొన్నారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 66 డివిజన్లలో అభివృద్ధి పనులు, వరద ముంపు నివారణ చర్యలు, మొక్కల పెంపకం తదితర అంశాలపైన అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ వర్షాకాలంలో తరచుగా ఉత్పన్నమయ్యే ముంపు సమస్యను శాశ్వితంగా పరిష్కరించాల్సి ఉందన్నారు.

(PTC)

TS RAINS

తెలంగాణలో మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ రోజు కొమురం భీమ్, మంచిర్యాల, జగిత్యాల, సిద్దిపేట, సంగారెడ్డి, గద్వాల, వనపర్తి, నారాయణ పేట, పెద్దపల్లి, హన్మకొండ, నాగర్ కర్నూల్, వరంగల్ జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. అటు ఆంధ్ర ప్రదేశ్ లోని పలు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన వర్షాలు కురసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

(PN)

GROUP ONE KEY

గ్రూప్ -1 ప్రిలిమ్స్ ప్రాథమిక కీ ని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసింది. ఈ కీ పై అభ్యంతరాలను ఈ నెల 17వ తేదీ వరకు స్వీకరించనున్నట్లు కమీషన్ ఒక ప్రకటనలో తెలిపింది. మెయిన్స్ పరీక్షలను ఈ ఏడాది అక్టోబర్ 21 నుంచి 27 వరకు నిర్వహించనున్నట్లు తెలిపింది. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు https://www.tspsc.gov.in/ ను సందర్శించవలసి ఉంటుందని పేర్కొంది.

(PN)

Sangareddy

సంగారెడ్డి జిల్లా రాయికోడు మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాల, మోడల్ హై స్కూల్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల , సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ కళాశాలను జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఈఓ వెంకటేశ్వర్లతో కలిసి పరిశీలించారు. రాయికోడ్ పాఠశాలలో అసంపూర్తిగా మిగిలి ఉన్న మౌలిక సదుపాయాల పనులు, ప్రహరీ నిర్మాణం, మోడల్ హై స్కూల్లో ప్లే గ్రౌండ్ కు కావలసిన సౌకర్యాలు, కస్తూర్బా బాలికల పాఠశాలలో కావాల్సిన అదనపు వసతులపై స్థానిక ప్రజా ప్రతినిధులు, విద్యార్థి సంఘాల నాయకులు కలెక్టర్ కు వివరించారు. ప్రజా ప్రతినిధులు తమ దృష్టికి తెచ్చిన విషయాలపై పరిశీలన జరిపి విద్యార్థులకు అవసరమైన మేరకు వసతులు, సౌకర్యాలను కల్పించడం జరుగుతుందని కలెక్టర్ వల్లూరి క్రాంతి తెలిపారు.

(PTC)

PM - Tadasana

ఈ నెల 21వ తేదీన ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ తాడాసన గురించి సామాజిక మాధ్యమం ఎక్స్ లో ఒక వీడియోను పోస్టు చేశారు. క్రమం తప్పకుండా చేసే తాడాసన సాధన చాలా ప్రయోజనకరంగా ఉంటుందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ తెలిపారు. ఇది శరీరానికి మరింత బలాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. మానవ శరీరంలో సమతుల్యతను కొనసాగించడాన్ని సులభతరం చేస్తుందని వివరించారు.

(X)

Ts text books

ముందు మాట మార్చకుండా పాఠ్య పుస్తకాలను ముద్రించడం వివాదాస్పదం కావడంతో, ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు విద్యార్థులకు పంపిణీ చేసిన పాఠ్య పుస్తకాలను, వర్క్ బుక్ లను వెనక్కి తీసుకోవాలని తెలంగాణ విద్యా శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. అప్పటి విద్యాశాఖ మంత్రిగా సబితా ఇంద్రారెడ్డిని పేర్కొంటూ, గత ప్రభుత్వంలోని అధికరుల

పేర్లతో పుస్తకాలను ముద్రించడంపై విమర్శలు రావడంతో విద్యాశాఖ ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకుంది.

(Desk)

MLC Naveen Kumar Reddy

మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉపఎన్నికలో గెలుపొందిన నవీన్ కుమార్ రెడ్డి ఈ రోజు ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేశారు. శాసన మండలిలోని తన చాంబర్‌లో కౌన్సిల్ ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు మహమూద్ అలీ, సబితా ఇంద్రారెడ్డి, నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు పొల్గొన్నారు.

(Desk)

కిషన్ రెడ్డి...

కేంద్ర మంత్రులుగా కిషన్‌రెడ్డి , బండి సంజయ్ బాధ్యతలు స్వీకరించారు. ప్రత్యేక పూజల మధ్య ఇరువురు బాధ్యతలు స్వీకరించారు. లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి రెండోసారి ఎంపీగా విజయం సాధించిన కిషన్ రెడ్డి.. ప్రధాని మోదీ క్యాబినెట్‌లో మరోసారి అవకాశం దక్కించుకున్నారు. ఆయనకు బొగ్గు, గనులశాఖ బాధ్యతలను ప్రధాని అప్పగించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... మోదీ హయాంలో కోతలు లేకుండా విద్యుత్ అందిస్తున్నామని వెల్లడించారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కూడా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.

(శంకర్)

Manchiryala

మంచిర్యాల జిల్లాలో పదో విడత హరితహారం లక్ష్యం ఖరారైంది జిల్లాలో మొత్తం 20 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. అటవీ శాఖ 3.50 లక్షలు మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్ణయించగా, మున్సిపాలిటీలో 3.50 లక్షల మొక్కలు, సింగరేణి ఆధ్వర్యంలో 4.20 లక్షలు, డీఆర్డీవో 20 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. జులైలో ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందని మంచిర్యాల ఆర్డీవో కిషన్ తెలిపారు.

(PTC)

భూపాలపల్లి

భూపాలపల్లి జిల్లాలోని చలివాగుపై వంతెన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు. టేకుమట్ల మండలంలోని టేకుమట్ల - రాఘవరెడ్డి పేట మధ్య ఉన్న చలివాగుపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గత సంవత్సరం జులైలో వచ్చిన వర్షాల వరద ఉధృతికి టేకుమట్ల, రాఘవరెడ్డి పేట గ్రామాల మధ్య చలివాగుపై ఉన్న వంతెన వరదలలో కొట్టుకు పోగా నూతనంగా వంతెన నిర్మాణానికి ప్రభుత్వం 4.70 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు.

(పిటిసీ)

రాజన్న సిరిసిల్ల...

యువత ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లా పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళ ను ఆయన ప్రారంభించారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ నివారణ ఫౌండేషన్ సహకారంతో ఈ జాబ్ మేళాను ఏర్పాటు చేశారు. సుమారు 60కి పైగా

కంపెనీలతో 1000 ఉద్యోగ అవకాశాలతో మెగా జాబ్ మేళ నిర్వహణకు కృషి చేసిన జిల్లా పోలీస్ యంత్రాగాన్ని విప్ అభినందించారు.

(పిటిసి)

NCB - PC

తనపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. తిరుమలలో శ్రీవారి దర్శనం చేసుకున్న అనంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో తిరుమలలో అవినీతి జరిగిందన్నారు. పరిపాలనలో ప్రక్షాళన తిరుమల నుంచే ప్రారంభిస్తానని చెప్పారు. నేటి నుంచి రాష్ట్రంలో ప్రజాపాలన మొదలైందని అన్నారు. దేశంలోనే ఆంధ్ర ప్రదేశ్ అన్ని రంగాల్లో నెంబర్ వన్ గా ఉండాలనే లక్ష్యంతోనే పాలన సాగనుందన్నారు. పొరుగు రాష్ట్రం తెలంగాణ కూడా సుభిక్షంగా ఉండాలని, అన్ని రంగాల్లో పురోభివృద్ధి దిశగా పయనించాలని చంద్రబాబు ఆకాంక్షించారు.

(Desk)